14012025-DIS-04_Layout 1 1/14/2025 1:58 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

విపక్షం ఇప్పుడు గుర్తుకొచ్చిందా?

'ఎదుటి మనిషికి చెప్పేటందుకే నీతులు' ఉన్నాయనే నానుడి సీఎం రేవంత్‌కు అతికినట్టు సరిపోతుంది. విపక్ష నేతగా ఆయన నోరు పారేసుకోవడం గురించి అప్పట్లో పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. కానీ, ఇప్పుడు బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నారు. ఆ సంగతి ఏడాది దాటినా చాలామందికి ఎక్కనట్టుగానే ఆయనకూ ఎక్కడం లేదేమో. ఆయన విపక్షాలపై చేస్తున్న అడ్డూ అదుపూ లేని విమర్శలు, విపక్ష నేతలపై ఉపయోగిస్తున్న భాషే అందుకు నిదర్శనం. సభ్య సమాజం తలవంచుకునే స్థాయిలో పెద్దా చిన్నా తేడా లేకుండా చేస్తున్న వ్యాఖ్యలపై ప్రజలకే కాదు, ఆయన సొంత పార్టీ కాంగ్రెస్‌లోనూ అంతర్గతంగా వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్టు తెలుస్తున్నది. అత్యంత దుర్భరమైన భాష ఉపయోగించిన సీఎంగా రికార్డు సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సీఎం హఠాత్తుగా 'ప్రతిపక్ష సహకారం' గురించి మాట్లాడటం కొంత వింతగానే తోస్తున్నది. ఇష్టారాజ్యంలో ఈ బేలతనం ఎక్కడి నుంచి వచ్చిదూరింది. ఇందుకు ఏదైనా కారణం ఉందా?

ప్రతిపక్షం బాధ్యత ప్రశ్నించడం. అలా ప్రశ్నించినందుకు కేసులు పెడుతూ వేధిస్తున్నారు. ఆ ప్రతిపక్షాన్నే ఇప్పుడు సహకరించమని అడుగుతున్నారా? అంటుకు లేకుండా చేస్తా.. మళ్లీ మొలకెత్తకుండా చూస్తా.. అంటూ అంతెత్తు ఎగిరెగిరి పడుతున్న సీఎంకు అసలు సహకారం అనే పదానికి అర్థం తెలుసా? అని సందేహం కలుగక మానదు. ప్రతిపక్ష పార్టీ కార్యాలయాలపై పాలక పక్ష కార్యకర్తలు దాడులకు తెగబడుతున్నారు. విధ్వంసం సృష్టిస్తున్నారు. బహిరంగ సమావేశాల్లో విపక్ష ఎమ్మెల్యేలపై బాహాటంగా హింసకు దిగుతున్నారు. పోలీసు బలాన్ని ప్రయోగిస్తున్నారు. ఓ వైపు ఇలా నోరు మూయిస్తూనే మరో వైపు సలహాలు ఇమ్మని గడుసుగా అడుగుతున్నారు. తన అసమర్థ, అర్థరహిత పాలనతో విశ్వనగరం హైదరాబాద్ పరువు గంగలో కలిపారు. ఇప్పుడు విపక్షాలు సహకరిస్తే విశ్వనగరంగా తీర్చిదిద్దుతానని వింత వ్యాఖ్యానం చేస్తున్నారు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని ఏడాదిలో విధ్వంసం పాలు చేసి ఇప్పుడు ఏదో సాధిస్తానని సీఎం రేవంత్ అనడం విడ్డూరమే.

నోటితో నవ్వుతూ నొసలుతో వెక్కిరించినట్టుగా ఉంది సీఎం ధోరణి. విపక్షాలను సభల్లో మాట్లాడనివ్వరు. సభలు పెట్టుకోనివ్వరు. ప్రజా సమస్యలపై ధర్నాలు చెయ్యనివ్వరు. ఇప్పటిదాకా ఒక్క అఖిలపక్ష సమావేశమైనా జరపలేదు. పాలకపక్షం, ప్రతిపక్షం కలిస్తేనే ప్రభుత్వమని ఇప్పుడే గుర్తుకు వచ్చినట్టుంది. కానీ, ఇవి మనసులోంచి వచ్చిన మాటలు కావు. ఇదంతా ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టిస్తున్నారనే విమర్శల నుంచి తప్పించుకునేందుకు చేస్తున్న ప్రయత్నం తప్ప మరోటి కాదు. ఈ మాటలు మనస్ఫూర్తిగా అన్నవే అయితే పీఏసీ చైర్మన్ పదవిని విపక్షానికి కాకుండా ఫిరాయింపు ఎమ్మెల్యేకు ఎందుకు కట్టబెట్టినట్టు? గత ఏడాది కాలంలో ప్రతిపక్షాల సలహా ఎన్నడూ అడుగలేదు. అడుగకుండా ఇచ్చినా పాటించలేదు. ధర్మ పన్నాలు, నీతిసూక్తులు వల్లించడం వల్ల ఫలితం ఏమిటి? చిత్తశుద్ధితో కూడిన ఆచరణలో అవి ప్రతిఫలించాలి.

మేధావులు గ్రామాలకు తరలాలి

ప్రస్తుతం మేధావుల తరగతి అంటున్నది ఒకప్పటి రుషులు, గురువుల తరగతి వంటిది. అప్పుడు వారి నుంచి సమాజం, పాలకులు కూడా ఆశించింది తాము సమాజాన్ని అధ్యయనం చేసి, ఆలోచించి, సమాజానికీ, పాలకులకూ మార్గదర్శనం చేయాలని. ఈ కాలంలో పాలకులు ఏమి కోరుకుంటున్నారో తెలియదు గాని, సమాజం మాత్రం అదే ఆశిస్తున్నది. ఆ ప్రకారంగా చేయటమే మేధావితనానికి, వారి ఉనికికి అర్థమవుతుంది. కానీ, అట్లా జరుగుతున్నదా? తెలంగాణలో మేధావులు అనేవారిని గమనిస్తే, బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నంతకాలం తమ పాత్రను ప్రశంసనీయంగా పోషించారు. అందుకు సమాజం సంతోషించింది. కాంగ్రెస్ అధికారానికి వచ్చిన ఏడాది తర్వాత కనిపిస్తున్నదేమిటి? ప్రభుత్వం ఎంత అప్రతిష్ట పాలైందో వీరు కూడా అంత అప్రతిష్టకు గురవుతున్నారు.

టంకశాల అశోక్

అందుకు కారణం ఏమిటి? ఇది ఒక విధంగా అర్థం కాని స్థితి. ప్రభుత్వమూ, తాము కూడా అప్రతిష్టను తెచ్చుకుంటున్నట్టు ఈ మేధావి తరగతి గ్రహించటం లేదనలేం. అందుకు కారణాలు వారికి తెలియదని కూడా అనుకోలేం. అటువంటప్పుడు ఆ స్థితి నుంచి బయటకు రావాలని వారు అనుకుంటున్నారా లేదా అన్నది ప్రధానమైన ప్రశ్న. అందుకు సమాధానం తామే చెప్పగలరు తప్ప మనం కాదు. సమాజానికి కావలసింది ఆ ప్రశ్నకు జవాబు కన్నా ముఖ్యంగా వారు తమ మేధావి పాత్రను గతంలో వలెనే నిజాయితీగా నిర్వర్తించటం.

ఎందువల్లనైతేనేమి వారా పని చేయటం లేదనేందుకు మనకు అనేకం కనిపిస్తున్నాయి. వాటిని గమనించినప్పుడు, వారు ఈ 13 మాసాల కాలంలో తాము చేయవలసిన పని, చేసిన సందర్భం ఒక్కటంటే ఒక్కటైనా కనిపించటం లేదు. అందుకు కొన్ని నిర్దిష్టమైన ఉదాహరణలను మాత్రం చూద్దాం. అన్నింటి గురించి చెప్పుకునేందుకు స్థలాభావం వల్ల వీలు కాదు గనుక. ఆ విధంగా మొదట ప్రస్తావిస్తున్నది మహిళలకు ఉచిత బస్సు పథకం. ఎందుకంటే, 6 గ్యారెంటీల లోని 13 అంశాలలో అన్నింటికన్న ముందు ఇది అమలుకు వచ్చి ఇప్పటికి ప్రభుత్వ పాలనాకాలంతో పాటుగా 13 నెలలైంది. కనుక దీని అమలుతీరు ఏమిటన్నది ఒక విషయం. రెండవది, ఉచిత బస్సు వల్ల మహిళా లోకానికి గృహ బంధనాల నుంచి విముక్తి లభించగలదన్న స్థాయిలో మేధావి ప్రముఖుడొకరు మాట్లాడారు. అంతవరకు బాగానే ఉన్నది. అయితే, తర్వాత కాలంలో స్వయంగా మహిళల అభిప్రాయాలు ఏ విధంగా ఉన్నాయో ఆ ప్రముఖుడు గాని, వారి తోటి మేధావులు గాని తెలుసుకునే ప్రయత్నం చేశారా?

అందరి దృష్టికి వస్తున్న దానిని బట్టి కొన్ని విషయాలు ఈ విధంగా ఉన్నాయి. విముక్తి మాటేమోగాని వారిలో అత్యధికులు ఆ పథకం పట్లనే అసంతృప్తి వ్యక్తపరుస్తున్నారు. మహాలక్ష్మి అనే గ్యారెంటీలో గల మూడు అంశాలలో బస్సు హామీ అమలైనా, రోజువారీ పని పాటలు చేసుకునే తమకు దానితో ఉపయోగం లేదన్నది ఒక విమర్శ. బస్సులు తగ్గించటం, అవి కిక్కిరిసిపోయి ఎక్కలేకపోవటం, ఎక్కినవారి మధ్య పోట్లాటలన్నది రెండవ విమర్శ. బడి పిల్లలు, వృద్ధులు, రోగులకు కాకుండా తగిన వేతనాలు సంపాదిస్తున్న వారికి ఎందుకనేది మూడవ విమర్శ. వీటన్నిటికి మించి, అదే మహాలక్ష్మిలో భాగమైన 'మహిళలకు ప్రతి నెల రూ.2,500' అన్నది అమలైతే అందరికీ ఉపయోగమని, ఆ పని ఎందుకు చేయటం లేదన్నది ప్రతి ఒక్కరి ప్రశ్న. గత ప్రభుత్వంపై ఆర్థికపరమైన, అప్పుల సంబంధమైన ఆరోపణలు ఎన్నికల ప్రచార సమయంలో స్వయంగా చేసినప్పుడు, ఇటువంటి మహాలక్ష్మి గ్యారెంటీనివ్వటం తమను ఓట్ల కోసం మోసగించటం కాదా అన్నది మౌలికమైన ప్రశ్న.

దీనితో పాటు మహిళలు అదే మహాలక్ష్మిలోని మరొక అంశం, రూ.500కు గ్యాస్ సిలిండర్ గురించి అడుగుతున్నారు. ఇది అమలవుతున్నది కొద్దిమందికేనని చెప్తున్నారు. అందరికీ అమలు చేస్తున్నట్టు ప్రభుత్వం కూడా అనకపోవటం గమనించదగినది. ఇక పథకం, వివిధ రైతు హామీల అమలు వైఫల్యాలు, అమలుకాని కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, నిలిచిపోయిన కేసీఆర్ కిట్, బడి పిల్లలకు పౌష్టికాహార పథకం, హాస్టల్ పిల్లలు వరుసగా విషాహారం బారినపడుతుండటం వంటివన్నీ కూడా తల్లులుగా, రైతు కుటుంబాలవారిగా, ఇతర పనులు చేసుకునేవారిగా ఈ రోజున తెలంగాణ వ్యాప్తంగా గ్రామాలలో, పట్టణాలలో మహిళలకు తీవ్ర అసంతృప్తిని కలిగిస్తున్నాయి.

వీటన్నింటి ముందు ఉచిత బస్సు అన్నది, అది కూడా పైన పేర్కొన్న లోపాలతో కూడుకొని, వెలవెలబోతున్నది. ఈసడింపులకు గురవుతున్నది. మరి వీటన్నింటి మధ్య, తాము మొదట్లోనే ఎంతో ఘనంగా, అభినవ చలం వలె, సిద్ధాంతీకరించిన 'మహిళా విముక్తి' ఏ విధంగా సిద్ధిస్తున్నదో ఈ మేధావి బృందం సమీక్షలు ఏవైనా చేసుకున్నదా? మొదట అంచనాలు వేయటంలో ఆక్షేపించవలసిందేమీ లేదు. కానీ, అంచనాలకు ఆచరణ అనుభవాలు గీటురాళ్లు కావాలి గదా? ఒకప్పుడు మహర్షులు, గురువులకు అటువంటి గీటురాళ్లు ఉండేవంటారు. కనుకనే వారు చెప్పినదానికి విలువ, జనామోదం, చివరికి రాజామోదం కూడా లభించేదంటారు. అటువంటి స్థితిలో, మన ప్రస్తుత తెలంగాణ మేధావులు అటువంటి గీటురాళ్లు ఏవైనా పెట్టుకున్నారా? లేనట్టయితే ఇప్పటికైనా ఆ పని చేస్తారా?

అట్లా చేయదలచుకుంటే మాత్రం తమ ప్రస్తుత గజదంత గోపుర నివాస స్థితి నుంచి తమకు తాము సాహసంతో విముక్తి కల్పించుకొని, గ్రామాలకూ, పట్టణ ప్రాంతాల్లోనే తమ చుట్టూ గల సామాన్యుల మధ్యకూ తరలివెళ్లవలసి ఉంటుంది. అక్కడ తమ మేధావితనాలను, పాక్షికతలను ప్రదర్శించి తాము కోరుకునేవి ప్రజల నోటి నుంచి రాబట్ట చూడటం గాక, వారు చెప్పేవి ఓపెన్ మైండ్‌తో వినవలసి ఉంటుంది. ఇక్కడ పట్టణ ప్రాంతాల సామాన్య ప్రజలు అనే ప్రస్తావన కూడా వచ్చింది. వారి నుంచి కూడా ఆరు గ్యారెంటీల అమలుపై అనేక ఫిర్యాదులుండగా, ఇటీవల వారి నివాసాలపై హైడ్రా దాడి ఒక పెద్ద బెడదగా మారింది. ఆ దాడి వల్ల ఏమేమి జరిగిందో రాష్ట్ర ప్రజలంతా చూసి కదిలిపోయారు. ఏ కదలికా లేనిది ప్రభుత్వ పెద్దలలో, ఈ మేధావి బృందంలోనే. యథాతథంగానే ఆ చర్యలు అమానవీయమైనవి, అప్రజాస్వామికమైనవి, కోర్టుల నుంచి విమర్శలను ఎదుర్కొన్నవి కాగా, మానవ హక్కుల గురించి ఎడతెగని ప్రసంగాలు చేసే ఈ మేధావులకు మాత్రం అందులో ఎటువంటి మానవ హక్కుల ఉల్లంఘన కనిపించలేదు.

అందుకు కారణం వారు భద్రలోక్ జనం కావడం కావచ్చు. తాము సుఖంగా బతికిన, బతుకుతున్న వారు. అందువల్ల వారికి ఇందిరా పార్కు వద్ద ధర్నా అవకాశం అన్నదొక్కటే మానవ హక్కుల విషయం అవుతుంది. మహిళలకు ఉచిత బస్సు వల్ల, ఆటోవారికి రూ.12,000 సహాయపు హామీ అమలుకాకపోవటం వల్ల ఆటో కార్మికులకు చెందిన లక్షలాది కుటుంబ సభ్యులు పడుతున్న కష్టాల పట్ల స్వయంగా ఆ మహిళలు సానుభూతి చూపుతున్నారు గాని, అందులో మేధావులకు ఏ హక్కులు గాని, సామాన్యుల మనోవేదనలు గాని దృష్టికి రావటం లేదు. తామూ తమ తరగతి వారూ, తమ సమస్యల కోసం ఇందిరా పార్కు వద్ద ధర్నాలు చేయగల అవకాశం ఉంటే చాలు ఇవన్నీ దిగుడుపు అయిపోతాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఇక్కడి పౌరహక్కుల సంస్థలకు, ఉద్యమాలకు, వాటి రాజీలేని కార్యక్రమాలకు దేశవ్యాప్తంగానే కాదు, అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది. ప్రస్తుత మేధావి బృందం దానినంతా ఒక్క ఏడాదిలో తుడిచిపెట్టింది. వారు తమ వెనుకటి ప్రతిష్టను పునరుద్ధరించుకోవటమైనా చేయాలి, లేదా రాహుల్ గాంధీ షేక్‌హ్యాండ్‌లు, లంచ్‌లతో, బీఆర్ఎస్ పట్ల ద్వేషంతో మైమరిచిపోయినట్టు నిజాయితీగా ప్రకటించి రంగం నుంచి నిష్క్రమించాలి.

చెప్పకొనేందుకు ఇంకా అనేకం ఉన్నాయి. ఒక విధంగా పై ఉదాహరణలు చాలు వీరి తీరుతెన్నులను అర్థం చేసుకునేందుకు. అవసరమైతే తక్కినవి మరొకసారి చర్చించవచ్చు. అయినా, మొత్తం గ్యారెంటీలు, రైతాంగ సమస్యలు, వారికిచ్చిన గ్యారెంటీలు, భూ సేకరణలలో దౌర్జన్యాలు, శాంతిభద్రతలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు వగైరా విషయాలలో జరుగుతున్నదేమిటో ప్రజలకూ, వీరికీ అనునిత్యం కనిపిస్తున్నదే.

కనిపించినా సరిగా అర్థం కానట్టయితే, పైన అన్నట్టు గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోని సామాన్యుల మధ్యకు మన మేధావి మహాశయులు తరలివెళ్లటం మంచిది. అటువంటి క్షేత్ర పరిశీలనలకు వారు పలు సంస్థల నుంచి ఫండింగ్ తెచ్చుకోగల సమర్థులు. కాకున్నా వారికి స్వయంగా నిధుల కొరత ఉందనుకోలేము.

గ్రూప్-1 అభ్యర్థులకు శాపం జీవో 29!

జీవో-29. అసలేంటీ జీవో? ఎస్టీ, ఎస్టీ, బీసీల వంటి బలహీనవర్గాలు తమ జీవన్మరణ సమస్యగా భావించి రోడ్లపైకి వచ్చి ప్రభుత్వంపై ఎందుకు పోరాడుతున్నాయి.? ఏముంది జీవోలో? ఎవరికోసం ప్రభుత్వం దీన్ని తీసుకువచ్చింది, గోప్యంగా ఎందుకు ఉంచుతున్నది? దీనికి వ్యతిరేకంగా పోరాడుతున్న వారిని ప్రభుత్వం అణచివేయాలని ఎందుకు చూస్తున్నది? ప్రభుత్వాలు ఉన్నదే బలహీన వర్గాలకోసం అయినప్పుడు ఇంత తీవ్రమైన సమస్యను వినేందుకు ఎందుకు ముందుకురావడం లేదు? సున్నితమైన రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం మొండిగా వెళ్లాల్సిన అవసరం ఏమున్నది? ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరకడం లేదు.

రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలి నోటిఫికేషన్ కావడం, భారీ స్థాయిలో గ్రూప్-1 ఉద్యోగాలను భర్తీ చేస్తుండటం, ప్రభుత్వ పాలనలో, విధానాల రూపకల్పనలో అత్యంత కీలక స్థానంలో ఉండటం, తమ సామాజిక హోదా, గుర్తింపును పెంచుకొనే గొప్ప అవకాశం ఉండటంతో సహజంగానే గ్రూప్-1 పరీక్షపై ఎంతో క్రేజ్ ఉన్నది. దీంతో గ్రూప్-1 నోటిఫికేషన్ వెలువడగానే నా లాంటి అభ్యర్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే పేద విద్యార్థులకు, ముఖ్యంగా గ్రామీణ పేద విద్యార్థులకు తమ తలరాతను తామే మార్చుకునే సువర్ణావకాశం ఇది.

రాష్ట్రంలో 90 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఉన్నారు. తెలంగాణ ఏర్పడిందే వారి ప్రయోజనాల కోసం. అట్టడుగు వర్గాలకు అందని ద్రాక్షగా ఉన్న గ్రూప్-1 అనేది సంపన్నుల ఉద్యోగమనే అనవాయితీ ఉండేది. అయితే, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ద్వారా గ్రూప్-1 ఉద్యోగం పేదలకు చేరాలని భావించిన గత ప్రభుత్వం సాహసోపేతంగా జీవో 55 ను తీసుకొచ్చింది.

జీవో 55 ఏమిటో స్పష్టంగా చెప్పాలంటే గ్రూప్-1 పరీక్ష అన్ని దశల్లో (ప్రిలిమ్స్, మెయిన్స్) రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల అమలే దీని లక్ష్యం. ఇంకా చెప్పాలంటే మెరిట్‌తో పాటు రిజర్వేషన్లకూ ప్రాధాన్యం ఇవ్వడమన్న మాట. ఒక్క మాటలో చెప్పాలంటే ఓపెన్ క్యాటగిరీలో ఎవరైనా పోటీ పడవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌తో పాటు ఇతర అగ్రకులాల మెరిట్ ఆధారంగా పోటీ పడొచ్చు. ఆ తర్వాత ఓపెన్ క్యాటగిరీలో సెలెక్టయినా బలహీన వర్గాల అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోకుండా ఆ తర్వాత ప్రతిభ కలిగిన బలహీన వర్గాలకు చెందిన అభ్యర్థులను తమ రిజర్వేషన్ క్యాటగిరీలో ఎంపిక చేస్తారు. ఇంకా చెప్పాలంటే ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఇటు ఓపెన్ క్యాటగిరీలో, అటు వారికి హక్కుగా ఉన్న రిజర్వేషన్ క్యాటగిరీలో పోటీపడుతారు, ఉద్యోగాలు సాధిస్తారు. ఉదాహరణకు.. వంద ఉద్యోగాలుంటే అందులో యాభై ఓపెన్ క్యాటగిరీలో ఉంటే ఎవరైనా (ఎస్సీ, ఎస్టీ, బీసీ, అగ్రకులాలు) ప్రతిభ ఆధారంగా పోటీ పడవచ్చు. మిగతా యాభై కోసం మాత్రం రిజర్వేషన్ల ఆధారంగా ఆయా సామాజిక వర్గాలకు చెందిన వారు పోటీ పడతారు (ఓపెన్‌లో ఎంపికైనా బలహీన వర్గాల వారిని తీసివేసి మిగతా వారిని ఎంపిక చేస్తారు).

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హైకోర్టులో జీవో 55పై గతంలో ఉన్న కేసుల దృష్ట్యా (జీవో 55 తప్పు అని హైకోర్టు ఇప్పటివరకు చెప్పలేదు) పబ్లిక్ ఇంట్రెస్ట్ సాకుతో రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్స్‌ను అణచివేస్తూ జీవో 29ని తీసుకువచ్చింది. 29 ఏం చెప్పున్నదంటే.. గ్రూప్-1 ప్రిలిమ్స్ దశలో మెరిట్ ఆధారంగా మెయిన్స్ పరీక్షకు ఎంపిక చేస్తారు. అంటే మొత్తం ఉద్యోగాలను (రిజర్వేషన్ ఉద్యోగాలను కలిపి) ఓపెన్ క్యాటగిరీగా పరిగణిస్తూ మెరిట్ ఆధారంగా తుది పరీక్షకు ఎంపికచేస్తారు. ఇక్కడ ఎవరైనా ఎంపిక కావచ్చు. ఒకవేళ మెరిట్ ఆధారంగా ఎంపికైన మొత్తం అభ్యర్థుల్లో బలహీనవర్గాలు ఎస్సీ, ఎస్టీ, బీసీలు (1:50) నిష్పత్తిలో లేకపోతే అదనంగా ఎంత తక్కువ ఉంటే అంతమందిని ఎంపిక చేస్తారు. 1.మెరిట్ ఆధారంగా ఎంపికైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులనే మెరిట్‌గా, రిజర్వేషన్ అభ్యర్థులుగా పరిగణిస్తారు. 2.ఒకవేళ మొత్తం మెరిట్ అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు (1:50) నిష్పత్తిలో సరిపడా ఉంటే తర్వాత రిజర్వేషన్లు అనేది వారికి ఉండదు. ఉదాహరణకు.. వంద ఉద్యోగాలతో నోటిఫికేషన్ ఉంటే అందులో 50 ఉద్యోగాలు మెరిట్ ఆధారంగా ఓపెన్ క్యాటగిరీ అనుకుంటే మిగతా 50 రిజర్వేషన్ ఉద్యోగాలు. వీటికి ఎస్సీ, ఎస్టీ, బీసీలే అర్హులు. ఇప్పుడు జీవో 29 ఏం చేప్తున్నదంటే.. 100 ఉద్యోగాలను (50 రిజర్వేషన్ ఉద్యోగాలతో సహా) మొత్తంగా పరిగణించి మెరిట్ ఆధారంగా (1:50) నిష్పత్తిలో ఎంపిక చేస్తారు. అంటే 100 X 50=5,000 అభ్యర్థులను మెయిన్స్ పరీక్షకు ఎంపిక చేస్తారు. ఎంపికైన 5 వేల మందిని మెరిట్ ఆధారంగా (1,25,000) వరకు ఎవరుంటే వారిని (లోకల్, నాన్‌లోకల్) సంబంధం లేకుండా ఎంపిక చేస్తారు. మెరిట్‌కు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల రిజర్వేషన్, అభ్యర్థుల ప్రయోజనాలను జీవో 29 నిండా ముంచింది.

కేస్-1: జీవో 29 ప్రకారం... మొత్తం ఉద్యోగాలు 100 అనుకున్నాం కదా, ఇందులో 50 ఓపెన్ క్యాటగిరీ, మరో 50 రిజర్వేషన్ అనుకుంటే మొత్తం 100 ఉద్యోగాలను మెరిట్ ఆధారంగా 100X 50= 5000 మొత్తంగా ఎంపిక చేస్తారు. ఇప్పుడు రిజర్వేషన్ ఉద్యోగాలు 50 అంటే వీరిని 150 చొప్పున 2,500 మందిని ఎంపిక చేయాలి. మనకు మెరిట్ ఆధారంగా ఎంపిక చేసిన 5,000, రిజర్వేషన్ల ఆధారంగా ఎంపిక చేసిన 2,500 మందిని మొత్తంగా 7,500 మందిని ఎంపిక చేసి ఉంటే (5000+2500=7500) ఈ రోజు న్యాయస్థానాల్లో జీవో 29 ఉండేది కాదు. నిరుద్యోగులు పోరాడే వారు కాదు.

కేస్-2: మొత్తం 100 ఉద్యోగాలను ఓపెన్ క్యాటగిరీగా అనుకొని మెరిట్ ఆధారంగా ఎంపిక చేసిన 5000 మంది అభ్యర్థుల్లో 2,500 మంది మెరిట్ రిజర్వేషన్ అభ్యర్థులు ఆ 5,000 మంది అభ్యర్థుల్లో ఉంటే వారిని రిజర్వేషన్ అభ్యర్థులుగానే పరిగణిస్తారు. అంటే ఇంకా రిజర్వేషన్ అనేది ఉండదు. రిజర్వేషన్లు అమలుచేయాల్సిన అవసరం లేదు. స్థూలంగా చెప్పాలంటే రిజర్వేషన్లు అభ్యర్థులను (1:50)కి జీవో 29 కుదిస్తున్నది.

ప్రతిభ ఉన్న బీసీ-బీ, బీసీ-డీ అభ్యర్థుల కలలకు జీవో 29 మరణ శాసనమే. ఎందుకంటే వారు మెరిట్‌లోనే ఎంపికయ్యారు, కాబట్టి ఇక వారి రిజర్వేషన్లు వారికి అమలు చేయాల్సిన అవసరం లేదు. మెరిట్‌లో నే (1:50చొప్పున) సరిపడా బీసీ-బీ, బీసీ-డీ అభ్యర్థులున్నారు. కాబట్టి ఇక వారికి రిజర్వేషన్లు అమలు చేయనవసరం లేదు. జీవో 29 ద్వారా రిజర్వేషన్లు ఎలా అందుతున్నాయో ఒకసారి చూస్తే బీసీ-బీ, బీసీ-డీ అభ్యర్థులకు 'సున్నా' రిజర్వేషన్ (వారు సరిపడా మెరిట్‌లోనే ఉన్నారు కాబట్టి) ఉదాహరణకు.. నోటిఫికేషన్‌లో పేర్కొన్న బీసీ-బీ ఉద్యోగాలు 37. వీరిని 1:50 చొప్పున తీసుకుంటే 1,850 అభ్యర్థులను ఎంపిక చేయాలి, కానీ 7,500 బీసీ-బీ అభ్యర్థులను ఎంపిక చేశారు. మొత్తం పోస్టులను ఓపెన్ క్యాటగిరీగా పరిగణించడంతో 28,000 మంది అభ్యర్థుల్లో 7,500 మంది బీసీ-బీ అభ్యర్థులు ఉండటంతో మళ్లీ అదనం గా వారి రిజర్వేషన్ అమలుచేయాల్సిన అవసరం రాలేదు.

ఎస్సీ , ఎస్టీ అభ్యర్థులు: వీరిని రిజర్వేషన్ ప్రాతిపదికన మాత్రమే ఎంపిక చేశారు, మెరిట్‌లో ఎంపికైనా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను రిజర్వేషన్ కోటాగానే పరిగణించారు. ఉదాహరణకు అభ్యర్థులకు రిజర్వేషన్ ఉద్యోగాలెన్ని ఉన్నాయో అంత మంది (1:50) చొప్పున ఎంపిక చేశారు. దీంతో ఎస్సీ అభ్యర్థులకు మెరిట్ ప్రయోజనాలు దక్కలేదు. ముచ్చటగా మూడోసారి కూడా గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో నిర్లక్ష్యం, సందేహాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పోటీ పరీక్షలో బలహీనవర్గాల వారికి రిజర్వేషన్లనేవి గుండెకాయ వంటివి. ఎస్సీ, ఎస్టీ, బీసీ వంటి అట్టడుగు వర్గాలు గౌరవ ప్రదంగా బతుకాలంటే ఉద్యోగమనేది కీలకం.

ఆ ఉద్యోగం సాధించాలంటే గుండె కొట్టుకోవడం (రిజర్వేషన్లు) తప్పనిసరి. కీలకమైన రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 29ను గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఏమున్నది? జీవో 55 కంటే జీవో 29లో ఎక్కువ ప్రయోజనాలున్నాయని ప్రభుత్వం భావించి ఉంటే, ఆ విషయాన్ని విద్యార్థులకు వివరించాలి. కానీ, ఈ విషయంలో అటు ప్రభుత్వం, ఇటు టీజీపీఎస్సీ విఫలమయ్యాయి. టీజీపీఎస్సీ ఉన్నదే నిరుద్యోగుల కోసం కదా, అలాంటప్పుడు ప్రభుత్వాన్ని సంతృప్తి పరచడం కంటే నిరుద్యోగులకున్న అసంతృప్తిని, అనుమానాలను తొలగించి ఉంటే బాగుండేది. జీవో 29 న్యాయస్థానాల్లో నిలబడేది కాదు. ఎందుకంటే ఓపెన్ క్యాటగిరీ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అభ్యర్థుల అవకాశాలను తగ్గించడం, రిజర్వేషన్ ఉద్యోగాల్లో అభ్యర్థుల అవకాశాలను తగ్గిస్తున్నది (కారణం మెరిట్ సాధించిన రిజర్వేషన్ అభ్యర్థులను ఇటు ఓపెన్ క్యాటగిరీలో అటు రిజర్వేషన్ల అభ్యర్థులుగా వారినే పరిగణించండి). జీవో 29 మెరిట్‌కే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఓపెన్ క్యాటగిరీలో జీవో 55 (ఇందులో 10 వేల మందికి) కంటే జీవో 29లో (ఇందులో 28 వేల మంది) మూడు రెట్లు అధికంగా ఓపెన్ క్యాటగిరీలో ఎంపికయ్యే అవకాశం ఉండటంతో ఎక్కువ మెరిట్ సాధించే అగ్రకులాలు, నాన్ లోకల్స్ అవకాశాలను పెంచింది.

టీజీపీఎస్సీ ఓపెన్ క్యాటగిరీలో ఎవరెవరు సెలెక్ట్ అయ్యారో, అందులో నాన్ లోకల్స్, ఓసీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎంతమంది సెలెక్టయ్యారో చెప్పలేదు. పాత పేపర్లతో ప్రతిష్టాత్మక గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను నిర్వహించడం ఎందుకని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. 'మల్టీ జోనల్‌స్థాయి పోస్టులను రాష్ట్రస్థాయి పోస్టులుగా పరిగణించి మెరిట్ ఆధారంగా ఎలా ఎంపిక చేస్తారు. ఇది రాష్ట్రపతి ఉత్తర్వుల ఉల్లంఘన కిందికి వస్తుంది. మొత్తం ఉద్యోగాలను (ఓపెన్ క్యాటగిరీ 209+354 రిజర్వేషన్ ఉద్యోగాలని కూడా) ఓపెన్ క్యాటగిరీగా ఎలా పరిగణిస్తారు. దీనివల్ల నాన్ లోకల్స్ భారీగా ఎంపికయ్యే అవకాశం ఉన్నదని గ్రూప్-1 అభ్యర్థుల సందేహం. టీజీపీఎస్సీనే రిజర్వేషన్లు పాటించడం లేదని హైకోర్టు చెప్పడం గమనార్హం.

ప్రభుత్వం మొండిగా పోతున్నది. మా దుఃఖాన్ని దిగమింగుకొని న్యాయస్థానాల్లోనైనా న్యాయం దక్కుతుందనే విశ్వాసంతో పైసా పైసా పోగు చేసుకొని కోర్టులను ఆశ్రయిస్తే తలుపులు మూసేసింది. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లకు జీవో-29 వ్యతిరేకమని న్యాయమూర్తులను ప్రార్థిస్తే సాంకేతిక కారణాలతో, కేసు వేయడంలో జాప్యం జరిగిందని డిస్మిస్ చేశారు. ప్రభుత్వానికి న్యాయస్థానాలు అండ గా నిలిచాయని సాక్షాత్తు ముఖ్యమంత్రి చెప్పడం ఇటు నిరుద్యోగులను, అటు న్యాయ కోవిదులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇప్పుడు సుప్రీంకోర్టులో న్యాయపోరాటానికి నిరుద్యోగులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికై నా ప్రభుత్వం పంతానికి పోకుండా జీవో-55 ప్రకారం ప్రస్తుత గ్రూప్-1 ఉద్యోగాలను భర్తీ చేయాలని నిరుద్యోగులంతా వేడుకుంటున్నారు. అసలు జీవో 29 రాజ్యాంగబద్ధమా లేదా రిజర్వేషన్లకు వ్యతిరేకమా అని ఎవరు తేల్చాలి?

-శ్రవణ్‌కుమార్, నిరుద్యోగి

*'ఆరంభింపరు నీచ మానవులు..' పద్యాన్ని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే